క్లుప్తంగా

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

ఆదిలాబాద్‌రూరల్: వేసవిలో విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల వైద్యాధికారి సర్ఫ్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వాన్‌వాట్ బాలుర, మామిడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది లక్ష్మీబాయి, ప్రేంసింగ్, ఇందుబాయ్, రుక్మిణి, సుమిత్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

నేరడిగొండ: విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బోథ్‌లోని సాయినగర్ కేజీబీవీలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ప్రతీ శుక్రవారం బోథ్ మండల పరిధిలో గల హాస్టళ్లలో హెల్త్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం పావని, హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని భుక్తాపూర్ అంగన్‌వాడీ- 7 టీచర్ అన్మోల్‌వార్ కవిత అన్నారు. శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అత్యవసరమైతే తప్పా ఇంటి నుంచి బయటకు రావద్దన్నారు. ఉదయం, సాయంత్రం పూట మాత్రమే పనులు చేసుకోవాలన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని రామాయి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న రామాలయం నిర్మాణానికి శుక్రవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరై ప్రత్యేక పూజలు పనులు ప్రారంభించారు. రామ మందిర నిర్మాణానికి గ్రామస్తులు కృషి చేయడం అభినందించారు. కార్యక్రమంలో రామాయి ఎంపీటీసీ మహేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆడే గజేందర్

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని మసీదులో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు మహబూబ్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కానిందే ఉద్ధవ్, జల్కే పాండురంగ్, బత్తిని కిషన్, సూర్యవంశీ పాండు, ఇర్ల శివుడు, జగదీష్, రమణ, విఠల్, రమేశ్, గాజుల పోతన్న పాల్గొన్నారు.

పురస్కారాల ఎంపిక కమిటీలో చోటు

ఆదిలాబాద్‌టౌన్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మేఘా సిటీ నావకళా వేదిక, ప్రభుత్వం సంయుక్తంగా ఉగాది విశిష్ట పురస్కారం అందిస్తుంది. ఈ పురస్కారాలు ఎంపిక చేసే కమిటీలో జిల్లా న్యాయవాది సుధీర్ కుమార్ సంగెంకు చోటు దక్కింది. ఈనెల 8న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ రావ్, బీసీ కమిషన్ చైర్మన్ వాకులాభరణం కృష్ణ మోహన్ రావ్, దైవజ్ఞ శర్మలు పురస్కారాలు అందజేయనున్నారు.

విద్యార్థుల క్షేత్రపర్యటన

ఖానాపూర్: క్షేత్ర పర్యటనలో భాగంగా మండలంలోని మస్కాపూర్ జెడ్పీఎస్ఎస్ విద్యార్థులు నిజామాబాద్‌లోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ప్రాజెక్టు గేట్లు, విద్యుత్ ప్లాంట్ పనితీరుపై హెచ్‌ఎం నరేందర్, ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు హెచ్‌ఎం పేర్కొన్నారు.



కైలాస్‌నగర్: కాంగ్రెస్ నాయకుల నివాళి



బజార్‌హత్నూర్: నివాళులర్పిస్తున్న నాయకులు



తాంసి: నివాళులర్పిస్తున్న విద్యార్థినులు

బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళి

జిల్లాలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో నాయకులు, అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. జెడ్పీ క్యాంప్ కార్యాలయ సమీపంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని అంగడీ బజార్ చౌరస్తాలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నివాళులర్పించారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఆదిలాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్



తలమడుగు: నివాళులర్పిస్తున్న అధికారులు



బేలలో..



ఆదిలాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న జోగు రామన్న, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు



ఆదిలాబాద్‌టౌన్: పీఆర్టీయూ ఆధ్వర్యంలో..



పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



నేరడిగొండ: తేజాపూర్‌లో..



ఇచ్చోడ: నివాళులర్పిస్తున్న నాయకులు



జైనథ్: నివాళులర్పిస్తున్న నాయకులు



ఇంద్రవెల్లి: నివాళులర్పిస్తున్న అధికారులు

'హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం'

ఆదిలాబాద్‌టౌన్: రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. కాంగ్రెస్ వైఖరికి నిరసనగా శనివారం రైతు దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి రాకముందు రైతులకు అనేక హామీలను ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు విస్మరించిందని ఆరోపించారు. రైతుబంధు, రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదని మండిపడ్డారు. రైతు కూలీలకు రూ.12వేలు ఇస్తామని ప్రకటించి దాన్ని అమలు చేయలేదని గుర్తు చేశారు. ఇలా రైతులకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలనే డిమాండ్‌తో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రైతు దీక్ష చేపడుతున్నామన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ వద్ద ఉదయం 10 గంటల నుంచి రైతు దీక్ష ప్రారంభమవుతుందని, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



మాట్లాడుతున్న జోగు రామన్న

సన్మానం

జైనథ్: మండలంలోని లక్ష్మీపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోరెడ్డి అశోక్‌ను పలువురు సాహితీవేత్తలు ఘనంగా సన్మానించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రిసోర్స్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమి సలహా మండలి సభ్యులు ఎస్ రఘు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కన్నెగంటి అనసూయ, కేంద్ర బాల సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ, బాల చెలిమి సంపాదకులు మనికొండ వేదకుమార్, బాల సాహిత్య రచయిత గరిపెల్లి అశోక్ పూలమాలతో సత్కరించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

నార్నూర్: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు వైద్యాధికారి మనోహర్ అన్నారు. శుక్రవారం సాక్షిలో సీహెచ్‌సీలో తాగునీటి కటకట అనే కథనం ప్రచురితమైంది. దీంతో ఐటీడీఏ ఏఈ రాథోడ్ సునీల్‌తో కలిసి ఆసుపత్రిని సందర్శించారు. ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా రోగులకు కూలింగ్ ఫ్రిడ్జ్ ఏర్పాటు చేసి శుద్ధ జలం అందించాలని హెచ్‌ఈవో నాందేవును ఆదేశించారు. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు ఆసుపత్రి ఆవరణలో బోర్‌వెల్ వేయడం జరుగుతుందన్నారు. తాగునీటి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట హెచ్‌ఈవో రాథోడ్ తులసిదాస్, వైద్య సిబ్బంది ఉన్నారు.

సాక్షి ఎఫెక్ట్..



ఫ్రిడ్జ్ ప్రారంభిస్తున్న అధికారులు

లంబాడాలు ఏకతాటిపైకి రావాలి

నేరడిగొండ: లంబాడాలు ఏకతాటిపైకి రావాలని లంబాడాల ఐక్యవేదిక రాష్ట్ర ముఖ్య సమన్వయకర్త జాదవ్ రమేశ్ నాయక్ అన్నారు. శుక్రవారం సాయంత్రం నేరడిగొండ మండలంలోని సవర్గాం తండా పంచాయతీలో జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ నాయక్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది లంబాడాలు ఉన్నారని, ఏ పార్టీ తమను గుర్తిస్తుందో వారికే పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు ఇస్తామన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బాను నాయక్, గురుకుల టీచర్స్ సంఘం రాష్ట్ర సెక్రటరీ రమేశ్ చౌహాన్, కిరణ్, మహేశ్, కృష్ణ, విజయ్ కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న లంబాడా నాయకులు

'బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం'

ఆదిలాబాద్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు శంకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బేల మండలం చప్రాల గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. ఈసందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ప్రపంచంలోనే భారతదేశం విశ్వ గురువుగా నిలిపేందుకు బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యకర్తలకు సైతం పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. బీజేపీలో చేరేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మురళీధర్, గజ్జు, పోశెట్టి, వెంకటేశ్, శివ, సాయికృష్ణ, విజయ్, చంద్ర పాల్గొన్నారు.

గుప్పుమంటున్న గుడుంబా



గుడుంబా డ్రమ్ములను ధ్వంసం చేస్తున్న పోలీసులు

- పల్లెల్లో మళ్లీ తయారీ
- గుట్టుచప్పుడు కాకుండా తరలింపు
- చిన్నాభిన్నం అవుతున్న కుటుంబాలు

సిరికొండ: గిరిజన గ్రామాల్లో మళ్లీ గుడుంబా గుప్పుమంటోంది. గుడుంబా తయారికి కావాల్సిన సరుకులు తక్కువ ధరలో లభించడంతో తయారీ ఊపందుకుంది. దీంతో గుడుంబా తాగి పలు కుటుంబాలు రోడ్డుపాలు అవుతున్నాయి. బతుకులు చిన్నాభిన్నం అవుతున్నాయి. గత ప్రభుత్వాలు గుడుంబా విక్రయాలపై ఉక్కుపాదం మోపడంతో పల్లెలు ప్రశాంతంగా ఉన్నాయి. గత కొన్ని రోజుల నుంచి గుడుంబా స్థావరాలు ఏర్పాటు చేసుకొని తయారు చేస్తున్నారు. అంతేకాకుండా గుట్టుచప్పుడు కాకుండా అమ్ముతున్నారు.

గూడెల్లో.. తండాల్లో తయారీ..

మండలంలోని పలు గిరిజన గూడెల్లో, తండాల్లో గుడుంబా తయారీ స్థావరాలు వెలుస్తున్నాయి. ఇప్పపువ్వు, బెల్లం, పటిక, విధ రసాయనలతో బట్టీలను ఏర్పాటు చేసుకుని తయారు చేస్తున్నారు. తయారు అయిన గుడుంబాను గుట్టుచప్పుడు కాకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గ్రామాల్లోనే తక్కువ ధరకు దొరకడంతో గుడుంబాకు బానిస అవుతున్నారు. ఇటీవల పోలీసులు పలు గ్రామాల్లో సోదాలు నిర్వహించగా.. భారీగా గుడుంబా పట్టుబడింది.

పచ్చని కుటుంబాల్లో చిచ్చు..

గుడుంబా పచ్చని కుటుంబాల్లో చిచ్చు పెడుతోంది. చిన్నచిన్న విషయాలకే ఇంట్లో గొడవలు చేస్తూ.. ప్రాణాలు తీసే వరకు వెళ్తున్నాయి. రాత్రంతా తప్ప తాగి అప్పులు చేస్తున్నారు. దీంతో ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా చితికి పోతున్నారు. ప్రజలకు గుడుంబా తాగడం ద్వారా కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి. తయారీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



గుడుంబా తయారు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇటీవల గ్రామాల్లో తనిఖీలు నిర్వహించాం. గుడుంబా వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించాం. గుడుంబా తాగి ప్రాణాలు పోగొట్టుకోవద్దు. ఆర్థికంగా కూడా చాలా నష్టపోతారు.

– భీమేష్, సీఐ, ఇచ్చోడ

తనిఖీలు చేయాలి



పల్లెల్లో గుడుంబా తయారు చేయకుండా ఎక్సైజ్ అధికారులు, పోలీసులు తనిఖీలు చేయాలి. గుడుంబా తయారు చేసే వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలి. వారి వల్ల అమాయక ప్రజలు ప్రాణాలు పోగోట్టుకుంటున్నారు.

– పెందుర్ అమృత్‌రావు, ఎంపీపీ, సిరికొండ

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



హోమంలో పాల్గొన్న భక్తులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

జైనథ్: మండలంలోని మాండగాడ గ్రామంలో మురళీ కృష్ణ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పుష్పాదివాసం, జలాదివాసం, ధాన్యాదివాసం, హోమం నిర్వహించారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరై పూజలు నిర్వహించారు.

సాయిబాబా ఆలయంలో పూజలు

తాంసి: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం యాగశాల ప్రవేశం, అర్చన, అభిషేకం, హోమం, ధ్వజారోణ కార్యక్రమాలను పండితులు గంగాధరయ్య, సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం ఉదయం అగ్నిగుండ ప్రవేశం నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆలయకమిటీ సభ్యులు కోరారు.

తాత్కాలిక మరమ్మతులు.. తప్పని ఇబ్బందులు

- రోడ్లు, వంతెనలు నిర్మించాలని కోరుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు, వంతెనలు, వరద దాటికి కోతకు గురయ్యాయి. దీంతో ఆ సమయంలో చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అయితే ఆ రోడ్లు, వంతెనలకు తాత్కాలికంగా మరమ్మతులు చేసి రాకపోకలను పునరుద్ధరించారు. కొన్ని రోజుల అనంతరం తాత్కాలికంగా చేపట్టిన మరమ్మతుల నుంచి మట్టి, బండరాళ్లు కొట్టుకపోవడంతో ప్రస్తుతం రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

అత్యవసర సమయంలో తప్పని తిప్పలు

మండలంలోని పలు చోట్ల కోతకు గురైన వంతెనలు, రోడ్లపై గుంతలు పడడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లాలంటే కనీసం 108 వాహనం వెళ్లలేని పరిస్థితి. అధికారులు, ప్రభుత్వం స్పందించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

వర్షాకాలంలో అంతే సంగతి..

మండలంలో ఆయా ప్రాంతాల్లో కోతకు గురైన వంతెనలు, రోడ్లు వేసవి కాలంలో మరమ్మతులు చేపట్టకపోతే వర్షాకాలంలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఈఫొటోలో కనిపిస్తున్నది ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చిచ్‌ధరి సమీపంలోని వంతెన. గత ఏడాది కురిసిన వర్షానికి వంతెన కోతకు గురైంది. ఆ సమయంలో తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. ప్రస్తుతం అక్కడ వేసిన మట్టి కొట్టుకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలి

బేల: పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలని జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్ట్ నిర్వహణ, నిఘాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం అన్ని వాహనాలను తనిఖీ చేయాలని సూచించారు. అక్రమ మద్యం, డబ్బు తరలింపుపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కోర్పణ(మహారాష్ట్ర) సీఐ సందీప్, ఎస్సై రాధిక, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ సాయినాథ్